బస్టాండ్‌లో గిఫ్ట్ డ్రాప్ బాక్స్ ఏర్పాటు



మేడ్చల్ బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన గిఫ్ట్ డ్రాప్ బాక్స్

మేడ్చల్: దసరా సందర్భంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారికి యాజమాన్యం ప్రకటించిన లక్కీడిప్ కోసం మేడ్చల్ బస్టాండ్‌లో గిఫ్ట్ డ్రాప్ బాక్సును ఏర్పాటు చేశారు. మేడ్చల్ నుంచి వివిధ రూట్లలో ఈనెల 27 నుంచి అక్టోబర్ 6 వరకు మెట్రో డీలక్స్, సూపర్ లగ్జరీ బస్సుల్లో ప్రయాణించే ప్రయాణీకులు తమ టికెట్ వెనక అడ్రస్, ఫోన్ నెంబర్లు రాసి డ్రాప్ బాక్సుల్లో వేయాలని డీఎం సుధాకర్ కోరారు. రీజినల్ కార్యాలయంలో డ్రా తీసి విజేతలను ఎంపిక చేస్తారన్నారు.

ప్రభుత్వ స్థలాన్ని కాపాడండి


వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నేతలు

మేడ్చల్: మేడ్చల్ పట్టణంలోని సర్వే నంబర్ 145 లో గల ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని మండల సీపీఎం అధ్యక్షుడు నరేష్ అధికారులను కోరారు. ఈ మేరకు ఆయన సీపీఎం నాయకులతో కలిసి కీసర ఆర్డీఓ ఉపేందర్‌రెడ్డికి శుక్రవారం వినతి పత్రం అందజేశారు. కొందరు వ్యక్తులు సదరు స్థలాన్ని కబ్జా చేసి పేదలకు విక్రయించే యత్నాలు చేస్తున్నారని దోపిడీని అడ్డుకోవాలని ఆయన అధికారులను కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పూజ, కోమురయ్య, నర్సింగ్‌రావు, రమేష్ తదితరులు ఉన్నారు.

సీఎంఆర్‌టీసీలో అంతర్జాతీయ సదస్సు


సదస్సులో పాల్గొన్న ప్రతినిధులు

మేడ్చల్‌రూరల్: కండ్లకోయలోని సీఎంఆర్ టీసీ కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. కళాశాల చైర్మన్ గోపాల్‌రెడ్డి ఈ సదస్సును ప్రారంభించారు. యూఎస్‌ఏ, మలేషియా, యూకే,జర్మనీ, ఇరాన్ తదితర దేశాల నుంచి 900 ప్రతినిధులు పేపర్స్ ప్రజెంటేషన్ సమర్పించారు. కార్యక్రమంలో సీఈఓ అభినవ్‌రెడ్డి, కార్యదర్శి వసంతలత, డైరెక్టర్ రాజిరెడ్డి, పలు దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ


ఇందిరమ్మ ఇంటికి ముగ్గు పోస్తున్న నేతలు

మేడ్చల్: మున్సిపాలిటీ పరిధిలోని అత్వెల్లి మూడవ వార్డులో నూతనంగా మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి మున్సిపల్ అధికారులు, మాజీ కౌన్సిలర్ దేవ, లబ్ధిదారులు శుక్రవారం భూమి పూజ నిర్వహించారు. ఇందిరమ్మ ఇళ్లకు నేతలు, అధికారులు ముగ్గు పోసి పనులు ప్రారంభించారు. మూడో వార్డులో ఇందిరమ్మ ఇంటికోసం అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ఇల్లు మంజూరయ్యేలా చూస్తానని మాజీ కౌన్సిలర్ దేవ అన్నారు. కార్యక్రమంలో లబ్ధిదారులతో పాటు వార్డు ఆఫీసర్ అరుణ్‌కుమార్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కుక్కలకు వ్యాక్సిన్



రేబిస్ నివారణ వ్యాక్సిన్ వేస్తున్న డాక్టర్ పద్మిని

ఘట్‌కేసర్: హైదరాబాద్ బ్లూ క్రాస్, మిషన్ రేబిస్ ఆధ్వర్యంలో శుక్రవారం కుక్కలకు ఉచితంగా రేబీస్ నివారణ వ్యాక్సిన్ వేశారు. మున్సిపల్ కమిషనర్ రాజేశ్, మండల పశువైద్యాధికారిని పద్మినితో కలిసి ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా 319 కుక్కలకు వ్యాక్సిన్ వేసినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, బ్లూ క్రాస్ సంస్థ ప్రతినిధులు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మందులు లేక ఇబ్బంది

పశు వైద్యశాలలకు నిలిచిన మందుల సరఫరా

- రోగాల భారిన పడుతున్న జీవాలు
- ప్రైవేట్‌కు సిఫారసు చేస్తున్న పశు వైద్యులు


సాక్షి,మేడ్చల్ జిల్లా: నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి ,రంగారెడ్డి జిల్లాల్లో అనేక మంది గొర్రెలు, మేకల పెంపకంతో ఉపాధి పొందుతున్నారు. సకాలంలో నట్టల నివారణ మందు (డీవార్మింగ్) అందకపోవడంతో మూగజీవాలు బలహీనపడి కొన్ని జీవాలు మృత్యువాత పడుతున్నాయి. దీంతో పెంపకందారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి ,రంగారెడ్డి జిల్లాల్లో సుమారు 9.55 లక్షల వరకు గొర్రెలు, మేకలు ఉన్నాయి. ఇందులో మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లాలో గొర్రెలు 1,44,401 ఉండగా, మేకలు 40,020 ఉన్నాయి. రంగారెడ్డి జిల్లాలో గొర్రెలు 5,78,254 ఉండగా, మేకలు 1,88,190 ఉన్నాయి. అలాగే, మేడ్చల్ జిల్లాలో రెండు ఏరియా పశు వైద్యశాలలు ఉండగా, 16 ప్రాథమిక పశు వైద్యశాలలు, 29 గ్రామీణ వైద్య శాలలు, రెండు గోపాల మిత్ర వైద్యశాలలు ఉన్నాయి. రంగారెడ్డి జిల్లాలో నాలుగు పాత తాలుకా వైద్యశాలలు, 46 పశు వైద్య కేంద్రాలు, 87 గ్రామీణ పశు వైద్య కేంద్రాలు ఉన్నాయి. గతంలో ఏటా నాలుగుసార్లు జీవాలకు నట్టల నివారణ మందు తాగించేవారు. తద్వారా జీవాలు ఆరోగ్యంగా ఉండేవి. గతంలో ప్రభుత్వం క్రమం తప్పకుండా ఈ మందులను సరఫరా చేసేది. ప్రస్తుతం పశు వైద్యశాలల్లో నట్టల నివారణ మందు లేకపోవడంతో కడుపులో పురుగులు పెరిగి జీవాలు సరిగ్గా మేత మేయడం లేదని పెంపకందారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

షాపుల్లో కొంటున్నాం...

గొర్రెలు, మేకలు పెంచుతున్న సంరక్షకులు మాత్రం నట్టల నివారణ మందును ప్రభుత్వం సరఫరా చేయడం లేదని ఆరోపిస్తున్నారు. దీంతో ప్రైవేటు దుకాణాల్లో కొనుగోలు చేయాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే మందులను పంపిణీ చేయాలని వారు కోరుతున్నారు.

పాల దిగుబడిపై ప్రభావం...

రెండున్న రేళ్లలో పదిసార్లు నట్టల నివారణ మందు తాగించాల్సి ఉంది. కానీ ఇప్పటి వరకు వేయలేదు. నట్టలు పెరగడంతో జీవాల్లో పాల ఉత్పత్తి, మాంసం దిగుబడి తగ్గిపోతుందని పెంపకందారులు వాపోతున్నారు. కొన్ని జీవాలు రక్తహీనతకు గురై బలహీనపడుతున్నాయి. సరైన సమయంలో చికిత్స అందకపోవడంతో వ్యాధి నిరోధక శక్తి తగ్గి, రోగాల బారినపడి మత్యువాత పడుతున్నాయి. మందుల కోసం ప్రైవేటు దుకాణాలను ఆశ్రయిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి వెంటనే మందును సరఫరా చేయాలని జీవాల సంరక్షకులు కోరుతున్నారు. ఈ విషయమై జిల్లా పశుసంవర్ధక శాఖ అధికార వర్గాలు మాత్రం నట్టల నివారణ మందుపై ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళుతున్నామని, ఎంత మందు అవసరమో ప్రతిపాదనలు పంపించాలని కోరారన్నారు.



ప్రారంభానికి మేడ్చల్ ఏటీసీ సిద్ధం

నేడు మంత్రులు శ్రీధర్‌బాబు, వివేక్ వెంకటస్వామి చేతుల మీదుగా ప్రారంభం


మేడ్చల్‌లోని ఏటీసీ సెంటర్

మేడ్చల్: ఐటీఐ కోర్సుల్లో నూతన సాంకేతిక విద్యా విధానాన్ని అమలులోకి తెస్తూ రాష్ట ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ నిర్మాణం పూర్తి చేసుకుని ప్రారంభానికి సిద్ధమైంది. ప్రభుత్వం ఐటీఐల్లో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ పేరుతో అత్యాధునిక డిప్లొమా కోర్సులను అందించేందుకు ఏటీసీల పేరుతో నూతన ఐటీఐ కాలేజీలను ఏర్పాటు చేస్తున్న విషయం విదితమే. ఇందులో భాగంగా ప్రయోగాత్మకంగా మేడ్చల్ ఐటీఐలో ఏర్పాటు చేశారు. ఏడాదిగా కొనసాగుతున్న నిర్మాణ పనులు పూర్తయ్యాయి. మేడ్చల్ ఐటీఐలో సువిశాల ప్రాంగణలో ఈ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి 250 మంది విద్యార్థులకు ఏటీసీలో ప్రవేశం కల్పించనున్నట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ హనుమానాయక్ తెలిపారు. నూతన కోర్సులు, నూతన విద్యతో విద్యార్థులకు మరిన్ని అవకాశాలు ఏర్పడతాయన్నారు. ఏటీసీలో అడ్వాన్స్ సీఎన్‌సీ టెక్నీషియన్, ఎలక్ట్రిక్ వాహనాల మెకానిక్, మెకానికల్ బేసిక్ డిజైనర్, రోబోటిక్, డిజిటల్ మాన్యుఫ్యాక్చర్ టెక్నీషియన్, అడ్వాన్స్ టూల్, ప్రాసెస్, ఆటోమేషన్ కంట్రోల్ వంటి కోర్సులు ఉంటాయన్నారు.

నేడు ప్రారంభం..

మేడ్చల్ లో నూతనంగా ఏర్పాటు చేసిన ఏటీసీ సెంటర్‌ను శనివారం ఉదయం మంత్రులు శ్రీధర్ బాబు, వివేక్ వెంకట స్వామి ప్రారంభించనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.




ఏటీసీ సెంటర్‌లో ఆధునిక వసతులు

రైతుల కోసం సీఎంను కలుస్తా


మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

ఘట్‌కేసర్: ప్రతి సమస్యకు ఒక పరిష్కారం ఉంటుందని, రైతుల కోసం ఎంతటి దూరమైన వెళతానని అవసరమైతే ముఖ్యమంత్రిని కలుస్తానని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. శుక్రవారం స్థానిక నారాయణ గార్డెన్‌లో రైతు సేవా సహకార సంఘం అధ్యక్షుడు రాంరెడ్డి అధ్యక్షతన జరిగిన 49వ వార్షిక నివేదిక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత రైతుల అభివృద్ధికి కేంద్రం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. పాలకవర్గాలు నిస్వార్థంగా పని చేస్తే అభివృద్ధి సాధ్యమని, జవాబుదారితనంగా పనిచేస్తే రుణమాఫీ అవుతుందన్నారు. రైతు వ్యాపారి కాదని, నష్టం వచ్చినా, పంటలు పండినా ఎండినా ప్రజలకు అన్నం పెట్టడమే లక్ష్యంగా పనిచేస్తారని, భూమిని నమ్ముకుని జీవిస్తారన్నారు. పోరాడి ఓడిన పర్వాలేదు కాని పోరాటం చేయకుండ ఓడొద్దన్నారు. విమర్శలు రాకుండా పని చేయాలని, రుణమాఫీ రిలే నిరహార దీక్షను సందర్శించి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ రాంరెడ్డి మాట్లాడుతూ రైతు రుణమాఫీ ప్రక్రియలో తమ తప్పేమి లేదని, రుణమాఫీ ఫైలు ఆర్థిక శాఖ దగ్గర ఉందన్నారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేయగానే రుణ మాఫీ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎండీ రాహుల్‌రాజ్, సంఘం వైస్ చైర్మన్ అనంతరెడ్డి, డైరెక్టర్లు లక్ష్మారెడ్డి, పోచిరెడ్డి, ధర్మారెడ్డి, ఉదయ్‌కుమార్ రెడ్డి, బాల్‌రాజ్, రామకష్టారెడ్డి, మహేందర్‌నాయక్, మాజీ ఎంపీపీలు శ్రీనివాస్‌గౌడ్, సుదర్శన్‌రెడ్డి, మేనేజర్ జయప్రకాశ్ పాల్గొన్నారు.

ఫోన్ మాట్లాడుతూ భవనంపై నుంచి పడి కార్మికుడు మృతి

పోచారం: ఫోన్ మాట్లాడుతూ..నిర్మాణంలో ఉన్న భవనం పైనుంచి పడిన వ్యక్తి మృతి చెందాడు. పోచారం ఐటీ కారిడార్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన విశాల్ పదేళ్ల కింద జీవనోపాధి కోసం జోడిమెట్ల వచ్చాడు. వెంకటాపూర్‌లోని అనురాగ్ యూనివర్సిటీ ఆవరణలో ఎనిమిది అంతస్తుల భవన నిర్మాణంలో మేస్త్రీగా పనిచేస్తున్నాడు. అతని వద్ద చత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన దేవవాస్ బంజారే (21) భవన నిర్మాణ కార్మికుడుగా పనిచేస్తూ అక్కడే ఉంటున్నాడు. గురువారం రాత్రి భోజనం చేశాక, ఫోన్ మాట్లాడుతూ భవనం పైకి వెళ్లి ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. తోటి కార్మికులు 108 వాహనానికి ఫోన్ చేశారు. 108 వాహన సిబ్బంది పరిశీలించి మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మేస్త్రీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చెరువు పరిసరాలు శుభ్రం చేసిన అధికారులు



మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం 'ఏక్ దిన్ ఏక్ గంట ఏక్ సాత్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ చెరువు పరిసరాల్లో పేరుకుపోయిన చెత్త, మట్టి శుభ్రం చేశారు. కార్యక్రమంలో మేనేజర్ శ్రీనివాస్‌గౌడ్, సీనియర్ అసిస్టెంట్ చంద్రమోహన్,వార్డు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో బతుకమ్మ వేడుకలు

పోచారం: పోచారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సిబ్బంది బతుకమ్మను పేర్చి పూజలు చేశారు. అనంతరం బతుకమ్మ చుట్టూ తిరుగుతూ నృత్యాలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు.

సామాజిక సమానత్వం కోసం పోరాడిన వీరనారి ఐలమ్మ

సాక్షి,మేడ్చల్ జిల్లా: చాకలి ఐలమ్మ సామాజిక సమానత్వం కోసం తన జీవితాన్ని త్యాగం చేశారని, ఆమె పోరాటం కేవలం ఒక వర్గానికే కాకుండా సమాజంలోని ప్రతిఒక్కరికి స్ఫూర్తి దాయకమని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి అన్నారు. శుక్రవారం మేడ్చల్ కలెక్టరేట్‌లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువత ఐలమ్మ ధైర్యసాహసాలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. సమాజంలో అణచివేతలకు వ్యతిరేకంగా పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ మనందరికి స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి ఝాన్సీరాణి, జిల్లా సోషల్ వెల్ఫేర్ అధికారి వినోద్ కుమార్, కలెక్టరేట్ ఏఓ ఎల్.రామ్మోహన్, వివిధ కుల సంఘాల జిల్లా ప్రతినిధులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు. అంతకు ముందు జిల్లా కలెక్టర్ ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. వివిధ శాఖల జిల్లా అధికారులు ,ఉద్యోగులు ఐలమ్మ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.


టీజీఓ అధ్వర్యంలో బతుకమ్మ సంబురాలు

ప్రకృతి సమతుల్యత, పర్యావరణ పరిరక్షణకు బతుకమ్మ పండుగ సూచికగా నిలుస్తోందని జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా(లోకల్‌బాడీ) అన్నారు. బాలికల మొదలు పెద్దల వరకు ఆట, పాటలతో ఆనందంగా జరుపుకునే బతుకమ్మ పండుగ మహిళా ఉద్యోగుల్లో మానసిక ఉల్లాసాన్ని పెంచుతుందన్నారు. శుక్రవారం మేడ్చల్ కలెక్టరేట్‌లో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా తెలంగాణ గజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ (టీజీఓ) అధ్వర్యంలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. జిల్లాలోని వివిధ శాఖలకు చెందిన మహిళా అధికారులు తీరొక్క పూలతో రంగురంగుల బతుకమ్మలను పేర్చి, పట్టు చీరలతో ముస్తాబై ఎంతో ఆహ్లాదంగా, ఉత్సాహాభరితంగా ఆట పాటలతో కోలాటంతో వేడుల్లో పాల్గొన్నారు.

ఘనంగా బతుకమ్మ సంబరాలు


బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు

మేడ్చల్: జూనియర్ కళాశాలలకు సెలవులు ప్రారంభం కానున్న నేపథ్యంలో శుక్రవారం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వివిధ ప్రైవేట్ కళాశాలల్లో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు బతుకమ్మలను తయారు చేసి ఆడి పాడి అనంతరం నిమజ్జనం చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పేరెంట్స్ టీచర్స్ సమావేశం నిర్వహించారు. విద్యార్థుల పురోగతిపై ఈ సమావేశంలో చర్చించారు. సమావేశంలో ప్రిన్సిపాల్ యాదగిరి,లెక్చరర్లు పాల్గొన్నారు.

సెయింట్ పీటర్స్‌లో రిక్రూట్‌మెంట్ డ్రైవ్

మేడ్చల్‌రూరల్: మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా 133 మంది విద్యార్థులు వివిధ కంపెనీలకు అర్హత సాధించగా 21 మంది విద్యార్థులు ఇన్ఫోటెక్ కంపెనీలో రూ.6–8 లక్షల ప్యాకేజీతో ఉద్యోగం సాధించారు. ఈ సందర్భంగా కళాశాల కార్యదర్శి టివి రెడ్డి, ప్రిన్సిపాల్ రామస్వామిరెడ్డి, డైరెక్టర్లు సరోజారెడ్డి, అనురాగ్‌రెడ్డి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ప్రణతి, పీఆర్వో రవిసుధాకర్ విద్యార్థులను అభినందించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం..

ఇద్దరు వ్యక్తుల అరెస్ట్


పోలీసుల అదుపులో నిందితులు

పోచారం: గుట్టుచప్పుడు కాకుండా కర్ణాటక నుండి డిఫెన్స్ మద్యం తెచ్చి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను నారపల్లిలో ఘట్‌కేసర్ ఎక్సైజ్ స్టేషన్ పోలీసులు అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ జూపల్లి రవి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కర్ణాటకకు చెందిన శివ శంకర్‌రెడ్డి చెంగిచర్లకు చెందిన గోగికర్ విజయభాస్కర్‌కు మెడం రవి అనే వ్యక్తి ద్వారా బస్సులో మద్యం సీసాలు పంపాడు. శుక్రవారం చెంగిచర్ల చౌరస్తాలో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు రవిని అనుమానంతో అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా మద్య అక్రమ రవాణా విషయం వెలుగులోకి వచ్చింది. అతని వద్ద కర్ణాటకకు చెందిన డిఫెన్స్ మద్యం సీసాలు 70 స్వాధీనం చేసుకున్నారు. అతడిచ్చిన సమాచారం ఆధారంగా విజయభాస్కర్ ఇంట్లో 69 సీసాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు నిందితులు మెడం రవి, శివ శంకర్, విజయభాస్కర్‌లపై కేసు నమోదు చేశారు. రవి, విజయభాస్కర్‌లను అరెస్ట్ చేశారు.

అన్నపూర్ణా నమోస్తుతే..

మేడ్చల్: మేడ్చల్ జిల్లా పరిధిలో దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాలను ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఐదవ రోజైన శుక్రవారం గడిమైసమ్మ ఆలయంలో అమ్మవారిని లక్ష్మీదేవిగా అలంకరించి దర్శనభాగ్యం కల్పించారు. పలు ఆలయాల్లో అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు.

ఎమ్మెల్యే పూజలు..

పట్టణంలో వివిధ ఆలయాల్లో నిర్వహిస్తున్న నవరాత్రి ఉత్సవాల్లో ఎమ్మెల్యే మల్లారెడ్డి పాల్గొన్నారు. గడి మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో భవానీ దీక్షలు తీసుకున్న వారికి భోజనాలు వడ్డించారు. కట్టమైసమ్మ ఆలయంలో నిర్వహించిన హోమంలో పాల్గొన్నారు.


అన్నపూర్ణాదేవిగా.. నిమిషాంబదేవి


అన్నపూర్ణాదేవి అలంకారంలో కీసరగుట్ట అమ్మవారు


పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మల్లారెడ్డి


లక్ష్మీదేవిగా గడి మైసమ్మ


వారాహి అమ్మవారిగా..జ్ఞానసరస్వతీ దేవి


కీసరగుట్టలో చండీహోమం నిర్వహిస్తున్న దృశ్యం

ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి


మేడ్చల్‌లో ఐలమ్మ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు

మేడ్చల్: భూమి కోసం భుక్తి కోసం చేతిలో కొడవలి పట్టి రజకార్లకు ఎదురొడ్డి పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ అని పలువురు వక్తలు అన్నారు. శుక్రవారం ఐలమ్మ జయంతి సందర్భంగా మేడ్చల్, ఎల్లంపేట్ మున్సిపాలిటీల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ విగ్రహానికి వివిధ పార్టీల నాయకులు, ప్రజాసంఘాల నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎల్లంపేట్ మున్సిపాలిటీ పరిధిలో వివిధ ప్రాంతాల్లో ప్రజా సంఘాల నేతలు ఐలమ్మ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గుండ్లపోచంపల్లిలో...

మేడ్చల్‌రూరల్: చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో అధికారులు, నాయకులు మున్సిపల్ కార్యాలయం సమీపంలోని ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు విక్రంరెడ్డి, మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్‌గౌడ్, మాజీ కౌన్సిలర్ మల్లిఖార్జున్ ముదిరాజ్, బీజేపీ అసెంబ్లీ కన్వినర్ మోహన్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షులు శ్రీధర్,రజక సంఘం నాయకులు అశోక్, మున్సిపల్ వార్డు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న నాయకులు, అధికారులు



నాగారం మున్సిపల్ కార్యాలయంలో ..